## గువ్వలు

'బీటీ' విత్తనంతో
నేల నిస్సారమైతోంది
ఇక రైతు జననం 'దుర్లభం'.

ఆమెకు అందముంది
అంతకు మించి నటనా నైపుణ్యముంది
లేనిదల్లా.. ఒంటి నిండా బట్టలే!.

నిన్నటి మాట
ఇయ్యాళ్ల లేదు
అతడు.. దబ్బుతిన్న 'అవినీతి పాము'



-జిందం అశోక్
సెల్:8978532225



నేటినిజం
# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 7-8-2025



## ఘంటారావం

తప్పస్సంపన్నులైనవారు
సురలనైనా శాసిస్తారు
మాండవ్య మహామునిలా
యమనియామాలనే సవరిస్తారు.

రహదారులపై
వరి కల్లాలు
ప్రయాణాల్లో
అల్లకల్లోలాలు.

అన్నింటినీ
జయించారా
అరిషడ్వర్గాలను
మరిచారా.

లోభం మితిమీరితే
ఎలా?
అధర్మానికి
అవకాశమివ్వటమే కదా.



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964


పుస్తక సమీక్ష

# సున్నిత అంశంతో.. "గతి తప్పిన ఋతువు"!

ఆడపిల్ల అంటే ప్రకృతిసిద్ధమైన స్వభావానికి అనుగుణంగా మాతృత్వాన్ని పొంది, కుటుంబాన్ని మమ తానురాగాల బంధంలో ఓలలాడించడమే కాదు.. ఆమెకు తనకంటూ ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వం, ఆలోచన ధోరణి ఉంటుందని.. కొన్ని శారీరక పరిస్థితుల వల్ల రజస్వల కాకపోయి నప్పటికీ ఆమెకు జీవితం ఉంటుందన్న విషయాన్ని తెలియజెప్పటం కోసం ఓ రచయిత్రి చేసిన ప్రయత్నమే.. **"గతి తప్పిన ఋతువు"** నవల! కవయిత్రి, రచయిత్రి శ్రీ మామిడాల శైలజ వృత్తిరీత్యా అధ్యాపకురాలు.. రచనా వ్యాసంగాన్ని ప్రవృత్తిగా మలచుకుని.. సామాజిక బాధ్యతతో ముందుకు సాగడం స్వాగతించదగింది. రచయిత్రి ఈ నవల ఆరంభంలో తమ ముందుమాటలో పేర్కొన్నట్లు.. ఆడజన్మ అంటేనే అమ్మ అయ్యే జన్మ అనే దృక్పథం ఉన్న సమాజం మనది. పుట్టుకతో వచ్చిన సమస్యవల్ల ఒక అమ్మాయి.. ఈ దేరకపోతే (రజస్వల కాకపోతే) ఆ కుటుంబం అల్ల కల్లోలమవుతుంది. ఈడేరని అమ్మాయి జీవితం అర్థరహితం అనే భావన మనందరి మెదళ్లలో పాతు కుపోయింది. ఇక సమాజం దృష్టిలో ఆమెకు భవిష్యత్తు లేనట్లేనన్న సంఘటనలూ చూస్తున్నాం. ఈ క్రమంలోనే రచయిత్రి మామిడాల శైలజగారు.. ఈ సమస్య మీద ఓ అవగాహన కల్పించడానికి.. సమాజం వారిని చూసే దృక్కోణం లో ఏదైనా మార్పు వస్తుందేమోనన్న చిన్ని ఆశతో.. ఈ నవలా రచనకు ఉపక్రమించడం అభినందనీయం.


**'టర్నర్ సిండ్రోమ్'** అనే పేరుతో పిలువబడే ఈ అరుదైన సున్నితమైన సమస్యను కొంతమేరకైనా అధిగమించడానికి.. సంబంధిత అమ్మాయిలకు.. వారి తల్లిదండ్రులకు కొంత మేరకైనా ఓ భరోసా కల్పించడానికి రాయబడిన నవలయే.. **"గతి తప్పిన ఋతువు"..** ఈ నవల ద్వారా శైలజగారు.. జన్మతః వచ్చే.. టర్నర్ సిండ్రోమ్ గురించి ఓ అవగాహన కలిగించడం కోసం చేసిన ప్రయత్నం ప్రశంసనీయం. ఈ నవలలో.. నిజంగా రజస్వల మొదలవ్వని ఒక అమ్మాయి, తన తల్లిదండ్రులు ఎదుర్కొనే ఆవేదనను ఆర్ద్రంగా రచయిత్రి దృశ్యమానం చేశారు.

మాతృత్వం అనేది ఎంత మధురమైన అనుభూతి అనేది చెబుతూనే, అది పొందలేని మహిళలు కూడా జీవితంలో మరెంతో సాధించగలరన్న విశ్వాసాన్ని రచయిత్రి కలిగించయత్నించారు. సమస్యలు ఎదురవ్వగానే కృంగిబాటుకు గురవ్వుతున్న వారికి, ఇదొక భరోసానిచ్చే నవలగా పేర్కొనవచ్చు... శరీరంలో సహజ సిద్ధంగా జరగాల్సిన పరిణామాలు.. చోటు చేసుకోలేనప్పుడు మనిషి శారీరకంగా, మానసికంగా ఎంతో కృంగిపోవడం సహజం.. ఒక టర్నర్ సిండ్రోమ్ కాదు.. ఇతర అసాధారణ సమస్యలతో బాధపడే ఎవరికైనా జీవితంపై ఆశలను చిగురింపజేసే విధంగా ఈ నవలను శైలజగారు రూపుదిద్దారు.

టర్నల్ సిండ్రోమ్ సమస్యకు గలకారణాలు.. చికిత్స విధానాలు కనుగొనాలనే ఆసక్తి, ఆవేదనతో రచయిత్రి నవలను తీర్చిదిద్దడం అభినందనీయం..

పది సంవత్సరాల నుండే అమ్మాయిల్లో సహజంగా వచ్చే శారీరక మార్పులు చాలా మంది అమ్మాయిలు అందాన్ని యిచ్చేవిగా భావించడం సహజం.. ఇదే విషయాన్ని రచయిత్రి శైలజగారు ఇందలి పాత్రల ద్వారా ఓ చక్కని సందేశాన్ని అందజేసే ప్రయత్నం చేయడం జరిగింది. ఈ నవలలోని **"అమృత"** పాత్ర ద్వారా అనేక విషయాలను ఈ అంశానికి సంబంధించి రచయిత్రి ప్రస్తావించారు. **"టర్నర్ సిండ్రోమ్"** వల్ల 'అమృత'లో 10సం॥ల్లో వచ్చే ఏ విధమగు శారీరక మార్పులు లేకపోవడం.. ఆమె తల్లిదండ్రులు అతి ప్రేమతో గమనించలేకపోవడం.. అమృత తండ్రి దయాకర్‌తో మాట్లాడినా.. తేలికగా కొట్టి వేయడం అనేది వాస్తవంగా మనలో చాలా మందిమి చేసే పొరపాట్లని తెలుసుకుంటాం.. కానీ రాను రాను అమృత సమస్యను గ్రహించడం.. వారు తమ కూతురు అమృత సంతోషం కోసం, కల్పన, దయాకర్‌లు ఏదైనా చేయడానికి సిద్ధపడటాన్ని ఈ నవలలో చిత్రించి, చాలా మంది తల్లిదండ్రులకు స్ఫూర్తిదాయకంగా ఉండేలా రచయిత్రి చూపిన చొరవ స్వాగతించదగింది. "టర్నర్ సిండ్రోమ్" భూమికగా ఈ నవలలో "అమృత" పాత్రను సహజంగా ఉండేలా సృష్టించారు. అమృత పాఠశాలలో కూడా స్నేహితులు అమృత సమస్యను అంతగా పరిపక్వత లేని చిన్నారులైనా కూడా ఎగతాళి చేయకపోవడం.. ఆడపిల్లలను అర్థం చేసుకునే మనస్తత్వంను చూపిస్తుంది.

నవల యొక్క కథానాయిక "అమృత"కు ప్రపంచంలో ప్రతి ఐదు వేలకు ఒకరిలో వచ్చే ఈ అరుదైన వ్యాధి వచ్చినా కృంగిపోకుండా తన స్నేహితులు, తల్లిదండ్రులు ఇచ్చిన ప్రోత్సాహం మరియు ఆధునిక వైద్య సౌకర్యాలను ఉపయోగించుకుని టర్నర్ సిండ్రోమ్‌ను అధిగమించి సహజమైన స్త్రీలా ఎదిగి ఎం.బి.బి.యస్. వైపు దృష్టి మరల్చుకుని మెడికోగా విదేశాలలో స్థిరపడిన డాక్టర్‌గా మన కళ్లకు కట్టే విధంగా ఉంచడంలో రచయిత్రి యొక్క రచనా వైచిత్రిని అభినందించి తీరుతాం.. ఇంకా ఈ నవలలో మరో ప్రధాన పాత్ర కథా నాయకుడు "అకుల్"ను రచయిత్రి శైలజగారు అమృతను పెళ్ళి చేసుకొన్న ఆదర్శభావాలు గల వ్యక్తిగా ఆవిష్కరించారు.



ప్రతులకు: మామిడాల శైలజ, ఫ్లాట్ నెం.301 రచనా రెసిడెన్సీ, హన్మకొండ, వరంగల్ తెలంగాణ-506 001. సెల్: 8500173819



> **ఆడజన్మ అంటేనే అమ్మ అయ్యే జన్మ అనే దృక్పథం ఉన్న సమాజం మనది. పుట్టుకతో వచ్చిన సమస్యవల్ల ఒక అమ్మాయి.. ఈదేరకపోతే (రజస్వల కాకపోతే) ఆ కుటుంబం అల్లకల్లోలమవుతుంది. ఈడేరని అమ్మాయి జీవితం అర్థరహితం అనే భావన మనందరి మెదళ్ళలో పాతుకుపోయింది. ఇక సమాజం దృష్టిలో ఆమెకు భవిష్యత్తు లేనట్లేనన్న సంఘటనలూ చూస్తున్నాం**

అయితే కొన్నిసార్లు అకుల్ కూడా అసహనానికి గురైన ఘటనలను చేర్చి.. సాధారణ సగటు భర్తలా మారేట్టు చేయడం వల్ల నవల యొక్క సహజత్వానికి మరింత బలం చేకూరింది.

వాస్తవంగా ఈ నవలలో అమృత సమస్య పరిష్కారానికి కొంత మేరకైనా అకుల్ పాత్ర కీలకమైందని చెప్పవచ్చు. అమృత, అకుల్‌లు ఒకరినొకరు దగ్గరవ్వడానికి నవలలో అక్కడక్కడ.. కొన్ని సన్నివేశాలను సినిమాను తలపించేలా రచయిత్రి సృష్టించి నవలకు పఠన యోగ్యతను పెంచారు.

నవలలో మరో ప్రత్యేకత ఏమిటంటే.. అమ్మ తల్లిదండ్రులు ఉన్నత విద్యావంతులు.. కాస్త ధనవంతులు.. కానీ మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి వారు, పేద వారి ఇండ్లలో ఇలా సమస్య వస్తే ఊహించడానికే బాధేస్తుంది. వారు సహజంగానే ఆడపిల్ల ఆరోగ్య సమస్యగా మరియు పరువుకు సంబంధించిన సమస్యగా కూడా భావిస్తారనేది నిజం!

ఈ నవలలో పొరిగింటి పెద్దావిడ పాత్ర చిన్నదైనప్పటికీ.. ఫంక్షన్‌కు పిలిచి.. అమృతను చూసి అన్న మాటలు అమృత తండ్రి దయాకర్‌లో ఆవేశాన్ని కలిగించినా... వెంటనే తేరుకుని ఆలోచనలో పడేయడం వంటి ఘటనలు.. సృష్టించడంలో రచయిత్రి శైలజ యొక్క నేర్పరితనం కానవస్తుంది.

ఎవ్వరిని నొప్పించలేని ఓ ఉద్దాత్తమయిన పాత్రగా దయాకర్‌ను సృష్టించడానికి దోహదపడిందని చెప్పవచ్చు.

ఈ నవలలోని మరో సన్నివేశాన్ని మనం ప్రస్తావించుకోవాల్సి ఉంది. నవలలో కొన్ని సందర్భాలలో "వివాహం, పిల్లలు మాత్రమే స్త్రీకి ముఖ్యం అని భావించే హిందూ సంప్రదాయంలో పెరిగిన దాన్నే కదా! ప్రస్తుతం ఈ సమస్య నాది.. ఒక్కదా నిదే కాదు.. అకుల్, నీతో వివాహం అయ్యాక మన ఇద్దరి సమస్య అయ్యింది. నీకు సంతానాన్ని, అందించలేక పోతున్నా..అన్న "గిల్టీ ఫీలింగ్" అనే అమృత మాటలు.. ఎంత ఎదిగినా స్త్రీలో ఉండే సాంప్రదాయ మనస్తత్వాన్ని ప్రతిఫలింపజేయడంలో రచయిత్రి శైలజగారు కృతకృత్యులైనారు.

అమృత చుట్టూ వున్న తల్లిదండ్రులు కల్పన దయాకర్, నాయనమ్మ, తనను పెళ్ళి చేసుకోవడానికి ముందుకు వచ్చిన ఆధునిక భావాలున్న "అకుల్"ను రచయిత్రి ఉన్నతంగా చిత్రించారు. కానీ వాస్తవ సమాజంలో అకుల్ లాంటి యువకులు ఉంటారా? అన్న సందేహం మనలో కలిగినప్పటికీ.. అకుల్ పాత్రతోనే ఈ నవలకు సంపూర్ణత్వాన్ని కలుగజేశారు. ఓ రకంగా అకుల్ పాత్ర ద్వారా సమాజం కూడా అకుల్‌లాంటి వారుండాలన్న ఆలోచనను కలుగజేశారు- అకుల్‌ను ఆదర్శంగా నిలిపారు.

ఈ నవల ముగింపులో అకుల్, అమృత తమ తల్లిదండ్రులకు అరుదైన కానుక కొరకు వెతుకుతుంటే.. మళ్లీ అమృత లోలోపల దాగివున్న తల్లిని కాలేననీ అసంతృప్తిని పూర్తిగా తొలగించేందుకు ముద్దులొలికే పాప రూపంలో అకుల్ ఓ బహుమతిని అందజేసి.. ఓ ఆదర్శ పురుషుడిగా నిల్వడం బాగుంది. ఆయన యొక్క పరిణితి, పరిపక్వతలను సూచించేలా పాత్రను మలచడంలో రచయిత్రి శైలజగారి ప్రతిభను ప్రశంసించి తీరుతాం..

నవలకు **"గతి తప్పిన ఋతువు"** పేరు పెట్టడం అన్ని విధాలా సమర్థనీయంగా ఉంది. నవలను ఏకబిగిన చదివించేందుకు.. అమృత, అకుల్, మిగతా పాత్రలను సృష్టించడం.. కథను బాగా నడిపించాయని చెప్పవచ్చు.

రచయిత్రి శైలజగారు నవలలో సందర్భోచితంగా సన్నివేశాలను సృష్టించారు. పాత్రలు.. పాత్రల మధ్య ఔచిత్యవంతమైన సంభాషణలను పొందుపరిచారు.

రచయిత్రి ప్రతి పాత్ర సహజంగా నవలలో ఒదిగిపోయేలా చూశారు.

కథకు సంబంధించిన వస్తువు, సున్నితమైనది, అరుదైన అయినప్పటికీ.. వ్యాధికి సంబంధించిన సమాచారాన్ని చాలా చక్కగా ఆయా సందర్భాల్లో.. ఆయా సన్నివేశాల్లో పాత్రల ద్వారా చక్కగా తెలియజెప్పి రచయిత్రి పాఠకులను మెప్పించారు.

ఆడపిల్ల రజస్వల కాకపోవడానికి వివిధ కారణాలు ఉండొచ్చు. కానీ ప్రధాన కారణం టర్నర్ సిండ్రోమ్ అని ఈ నవల ద్వారా తెలుసుకుంటాం..

మనుషుల్లో 23 జతల క్రోమోజోములు ఉంటాయి. స్త్రీలలో 23 జతల క్రోమోజోముల్లో ఏదైనా ఒక జతలో ఎక్స్ క్రోమోజోమ్ ఏర్పడకపోతే అటువంటి వారిలో 45 క్రోమోజోములు ఉంటాయనీ.. ఇలా 45 క్రోమోజోములున్న వారిలో అండాశయాలు చాలా చిన్నవిగా ఉంటాయనీ- అందుకే వీరు ఎప్పటికీ రజస్వల కాలేరన్న వాస్తవాన్ని.. ఈ నవలలో.. డా॥ జనార్ధన్‌రావుతో అమృత తల్లిదండ్రులకు చెప్పించారు. కూతురు అమృతను పరీక్ష కోసం డాక్టర్ వద్దకు తీసుకెళ్లినప్పుడు.. డాక్టర్ చెప్పే మాటలు విన్న కల్పన, దయాకర్‌లు విస్తుపోవడం.. వారికి డాక్టర్‌కు మధ్య జరిగే సంభాషణలు.. సన్నివేశాలు పాఠకులను కలచివేసే విధంగా దృశ్యమానం చేశారు.

'టర్నర్ సిండ్రోమ్' లక్షణాలున్న ఆడపిల్లలు రజస్వల అయితే కాలేరు కానీ.. వివాహం చేసుకుని సాధారణ జీవితాన్ని గడిపే అవకాశం ఉందనీ.. అయితే.. మాతృత్వాన్ని ఎప్పటికీ పొందలేరని డాక్టర్ చెప్పగానే.. అమృత తల్లి కల్పన మాతృ హృదయం అంతులేని ఆవేదనతో తల్లడిల్లిపోయే సన్నివేశం.. పాఠకులను కదిలించే విధంగా ఉంది.

ఇలా రచయిత్రి మామిడాల శైలజగారు.. టర్నర్ సిండ్రోమ్‌కు గురయ్యే బాధితులకు మనోధైర్యాన్ని యిచ్చేలా ఈ నవలను తీర్చిదిద్దారు. నవలా రచనకు సంబంధించి కనీస ప్రమాణాలు పాటిస్తూ.. పాత్రల చిత్రణ చేసి.. పాత్రల మధ్య వస్తు సంబంధ సంభాషణలను సమర్థంగా పొందుపరిచి.. నవలకు పఠన యోగ్యతను పెంచారు. రచయిత్రి అంతర్గతంగా ఓ సామాజిక రుగ్మతను ప్రస్తావించి.. ఆ రుగ్మతను ఎలా అధిగమించాలో తెలియజేసిన తీరు బాగుంది.

సమాజహితాన్ని కోరాలి సాహిత్యం అన్న నానుడిని నిజం చేసేలా.. ఓ సున్నిత అంశంపై నవల రాసి ప్రజల్లో ఓ అవగాహన కలిగిచేందుకు రచయిత్రి శైలజగారు చేసిన ప్రయత్నాన్ని ప్రశంసిద్దాం..

ఈ నవల సామాజిక చైతన్యానికి కొంతమేరకైనా ఉపయోగ పడగలదని విశ్వసిద్దాం..



- దాస్యం సేనాధిపతి
సెల్:9440525544

# మనిషిని పల్లవిగా మలచుకున్న కవి సినారె

-డా॥ నందిని సిధారెడ్డి



పురస్కార గ్రహితలు డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్, ఆచార్య జి. చెన్నకేశవ రెడ్డి, కందాళై రాఘవాచార్య, తిరునగరి శరత్‌చంద్ర, ఒద్దిరాజు, ప్రవీణ్‌కుమార్‌లతో అతిథులు డా॥ పోరెడ్డి రంగయ్య, డా॥నందిని సిధారెడ్డి, ఆచార్య ఫణీంద్ర.

మనిషిని పల్లవిగా,పతాకగా మలచుకుని గొప్ప రచనలు చేసి తెలుగు సాహిత్యంలో తనదంటూ ఓ ప్రత్యేకతను చాటుకున్న నిరంతర స్ఫూర్తి డాక్టర్ సి.నారాయణ రెడ్డి అని తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. యువభారతి ఆధ్వర్యంలో తెలుగు వెలుగు అనుబంధ సంస్థల సహకారంతో ప్రతీ నెల మొదటి ఆదివారం నిర్వహించే సాహిత్య కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని సినారె కవిత్వంలో ప్రగతి శీల మానవతా వాదం అనే అంశంపై మాటాడారు. కవిత్వంలో మనిషే ప్రధాన కేంద్రమని,ఆ మనిషిని కవితా వస్తువుగా ఎంచుకొని సమాజంలో ఉన్నత భావాలు మొలకెత్తాలని ఆశించారన్నారు.

మనిషి అవధిగా, ఆకాశంగా, శస్త్రంగా, శాస్త్రంగా ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా మారుతున్న వైనాన్నీ సోదాహరణంగా వివరించారు.జీవితం పట్ల అమిత గౌరవం కలిగిన కవి సినారె అంటూ, ఎన్నిసార్లు చెక్కితే ఓ శిల్పం, ఎన్నిసార్లు తీర్చితే ఓ చిత్రం, కబుర్లు చెప్పకే కాలమా! ఎన్నిసార్లు చస్తే ఓ. జీవితం అంటూ సినారె కవితా పంక్తులను గుర్తు చేసుకున్నారు. తన కవిత్వానికి ఇతి వృత్తం మానవత్వమే అని చాటుకున్న సినారె ప్రగతిశీల మానవతావాదం వైపే మొగ్గు చూపారన్నారు. యువభారతి రాష్ట్ర అధ్యక్షుడు ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ ఆచార్య ఫణీంద్ర అధ్యక్షతన ఈ కార్యక్రమంలో యువభారతి వ్యవస్థాపక సమావేశ కర్త ఆచార్య వంగపల్లి విశ్వనాథం కార్యదర్శి జీడిగుంట వెంకట్రావు, తేజ సాహిత్య సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పోరెడ్డి రంగయ్య ఆత్మీయ అతిథులు గా పాల్గొన్నారు. సినారె 94 వ జయంతి సందర్భంగా ప్రముఖ కవులు డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్,ఆచార్య జి.చెన్న కేశవ రెడ్డి, కందాళై రాఘవాచార్య, తిరునగరి శరత్ చంద్ర,ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్‌లకు ఈ సందర్భంగా సినారె సాహిత్య పురస్కారాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో తెలుగు వెలుగు సమాఖ్య భాగస్వామి సంస్థల ప్రతినిధులు ,ప్రముఖ సాహితీ వేత్తలు డాక్టర్ నాళేశ్వరం శంకరం, చీకోలు సుందరయ్య, కందుకూరి శ్రీరాములు, జి.జయరాములు, తాళ్ళపల్లి మురళీధర్ గౌడ్ ,ప్రఫుల్ల చంద్ర, వేంకట సత్యమూర్తి, రఘుశ్రీ ,గడ్డం సులోచన, యరకల యాదయ్య, యువభారతి కోశాధికారి ఆమాతి రవీంద్ర, సహాయ కార్యదర్శి నవీన్ గౌడ్, సభ్యులు డాక్టర్ ఎస్. నారాయణ రెడ్డి, కాకర్ల హనుమంత రావు, మట్టిగుంట వెంకట రమణ, ఇడుకుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నిస్వార్థ సేవకు ప్రతీక పింగళి వెంకయ్య





వెంకటసుబ్బారావుకు పురస్కారం అందజేస్తున్న బండారు దత్తాత్రేయ, డా॥కె.వి.రమణాచారి, వంశీ రామరాజు, తెన్నేటి సుధాదేవి, పొత్తూరి సుబ్బారావు తదితరులు.

దేశ ప్రజలకు గుర్తింపు తేవడంతో పాటు వారికి గర్వకారణంగానూ జాతీయ పతాకం నిలుస్తుందని హరియాణా.. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటం వేళ మహాత్మాగాంధీ సూచనల మేరకు జాతీయ పతాకాన్ని రూపొందించిన పింగళి వెంకయ్య చిరస్మరణీయుడన్నారు. వంశీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి త్యాగరాయ గానసభలో పింగళి వెంకయ్య జయంతిని నిర్వహించారు. తెలంగాణ గాంధీ స్మారక నిధి అధ్యక్షుడు గోవిందరాజు వెంకటసుబ్బారావుకు పింగళి వెంకయ్య వంశీ జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేసి సన్మానించారు. ప్రభుత్వ మాజీ సలహాదారు కేవి రమణాచారి అధ్యక్షత వహించగా ప్రముఖులు నరసింహం, పొత్తూరి సుబ్బారావు, వంశీ రామరాజు, ఫణికశ్యప్, ప్రసన్న, రాజారాణి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# ధీరోత్తమా .. ఓ సినారె



ధీరూత్తమా.. చీకటి శాఖలను
చీల్చినా ఓ సినారె
గురోత్తమా సాహిత్య
సౌరభాలు వెదజల్లిన సినారె
వ్యక్తిత్వ భావనకు నిజ అర్థం నీవయ్యా
చైతన్య కేతనాలు నీ జీవిత ధనమయ్య
సౌశీల్య పరిమళాలు నీచరితకు
అర్థ మయ్యా సినారె
॥ధీరొత్తమా॥

తల్లి సరస్వతీ రుణము తీర్చబయలు దేరీ
సాహిత్య దీపికలు అడుగడుగున వెలిగించీ
శ్రమ సౌందర్యం లో పల్లవైనా వయ్యా సినారె
॥ధీరొత్తమా॥

అంచెలు అంచెలుగా పదవులను ఏలుకొని
ప్రతి అంకంలోనా ప్రతిభ ఎంతో చాటుకుని
ఆదర్శం తోడా ఆణిముత్యమైన వయ్యా సినారె
॥ధీరొత్తమా॥


గౌరవభావానికి సాక్ష్యములే నీ రూపం
సంస్కృతి చాటునులే నిలువెత్తు నీ ధర్మం నీడనిచ్చే
చెట్టు లాగా ఉపకారం సత్యమయ్యా సినారె
॥ధీరొత్తమా॥

నీ హృదయంలోనా ఎల్లప్పుడూ తేజస్సు
ప్రతి పనిలోనా ని
మగ్నమే నీ మనసు
ఓదార్పు మాటతోని ప్రజ్వలించినావయ్యా సినారే
॥ధీరొత్తమా॥

అలసట లేదంటూ జీవితాన ప్రతిచోట
కలమును సాగించి జ్ఞానపీఠమ యినావు
విశ్వంభర తేజం సాహిత్య శిఖర కీర్తి వయా సినారె
॥ధీరొత్తమా॥

కలముకు ఆదర్శం నీ రచనలు కద స్ఫూర్తి
నువ్వే మహా మనిషి నువ్వే ప్రతిభా మూర్తి
కన్నీటి దుఃఖంలో మమ్ము ముంచి వెళితివా సినారె
॥ధీరొత్తమా॥

( సినారె జయంతి సందర్భం గా)



- సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038

పుస్తక సమీక్ష

# ఐహిక, ఆముష్మిక ప్రపంచాలకు పనికివచ్చే పుస్తకం

పుట్టినది ఆదిగా మనిషికి ఎవరో ఒకరు తోడు కావాలి. బాల్యంలో తల్లిదండ్రులు, కౌమార వయసులో గురువులు, సహాధ్యాయులు, సహోద్యోగులు భార్య పిల్లల తోడు ఉంటుంది. అరవయిలో ప్రవేశించగానే, ఒక్కరొక్కరు వారి వారి దారులు చూసుకుంటారు. ఒక్కడవుతాడు. ఆ సమయాన మనిషికి ఆధ్యాత్మికం తోడు అవుతుంది. అంతకు మునుపు ఆధ్యాత్మిక చింతన కొద్దో గొప్పో ఉన్నా, అరవయి తరువాత అతనికి ఆధ్యాత్మికమే ఆసరా అవుతుంది. దేశకాల పరిస్థితులు ఎన్ని మారినా, ఆధ్యాత్మికమే చెరుగని సహచరుడు. జీవిత అంతము వరకు వెంట వచ్చు సన్నిహితుడు. ఐహికము, అముష్మికములోను ఆధ్యాత్మిక చింతన ఉపయోగపడుతుందని విశ్వాసము.

రచయిత ఆర్.సి. కృష్ణస్వామి రాజుగారు నిరంతర చింతనాపరులు వ్రాయటము మొదలుపెట్టి ఓ దశాబ్దానికి కాస్త అటుగా అయినా, రెండు దశకాల పుస్తకాలు పాఠక లోకానికి అందిచ్చారు. సమాజ సబంధాలు, మానవుని ఆశ, పేరాశలు, ఎదుర్కునే చీకటి వెలుగులను ఏకరువు పెడతారు. తనదైన తిరుపతి ప్రాంతభాష యాసలతో పాత్రలు పరిచయమై, సరదాగా సాగి, నీతి సారాంశంతో ముగుస్తాయి. ఎన్ని రాసినా నాలుగు కాలాలపాటు నిలిచేది ఆధ్యాత్మిక మేనన్న ఎరుకతో.. రాజుగారు అప్పుడప్పుడు మనకు ఆధ్యాత్మికతను తనదైన కోణంలోంచి పరిచయం చేస్తారు. లోగడ రాజుగారు 'గతం గతః', 'యోగక్షేమం వహామ్యహం' అను రెండు ఆధ్యాత్మిక పుస్తకాలు అందించారు. ఈ సిరీస్‌లో 'యద్భావం తద్భవతి' ముచ్చటగా మూడవది. మీరు గమనించారో లేదో... 'వర్తమాన ప్రపంచాన్ని, నడుస్తున్న చరిత్రను పరిచయం చేసే ప్రతీ దిన పత్రిక ఎక్కడో ఓ ప్రామినెంట్ స్థలాన్ని ఆధ్యాత్మికతను కేటాయించి తమ గౌరవాన్ని చాటుకుంటూ ఆధ్యాత్మికత కుండే ప్రాముఖ్యతను ఈ పత్రికలు చెప్పకనే చెబుతాయి.


ప్రముఖ దినపత్రికలు వార్త, సాక్షి, నమస్తే తెలంగాణలు లోగడ తమ పత్రికలలో ప్రచురించిన ఆధ్యాత్మికాలకు పుస్తక రూపం ఇది. చెప్పదలచిన విషయ సారాంశాన్ని 'కథ'గా అందిస్తున్నారు రచయిత. ఈ సంకలనంలోని మరో విశేషం.. ఎన్నుకున్న విషయాన్ని చిన్న చిన్న వాక్యాలుగా సరళమైన భాషలో వివరించటం, రాజుగారు సా'మాన్య' మానవులను దృష్టిలో ఉంచుకుని రాసారులా ఉంది. ప్రతీ కథా వ్యాసం, అందమైన బొమ్మతో మొదలయి రెండు పేజీల విషయ వివరణతో రెండు పేజీలు సాగి (ఒకటి రెండు కథలు తప్ప) ముగుస్తుంది. ప్రతి కథ చివర వ్యాస సారాంశము చక్కని అమృత గుళికల్లాంటి రెండు మూడు వాక్యాలు పాఠకుడిని ఆకట్టుకుంటాయి. అరవయికి కాస్త అటుగా ఉన్న రాజుగారి 'చింతన' బహుధా ప్రశంసనీయం. గొప్ప పరిణతి గలవి.ఎంతో క్లిష్టమైన విషయం కూడా రాజుగారి ఏతిలో అతి సరళమై అరటి వంటు ఒలిచిపోట పెట్టినట్లు ఉంటుంది.

రాజుగారి ఈ కథా వ్యాసాల గురించి స్థాలీపులాక న్యాయంగా వివరిస్తాను.

మృత్యువు అంటే ప్రతివారికీ, కాటికి కాళ్ళు చాచుకున్న ముదుసలికి సైతం వెరపే! 'ఎగిరిపోవటం చిలుకనైజం'లో- "ఎగిరిపోవటం చిలుక.. సహజనైజం. ఎంతమంచి చిలుకైనా, మనం పంజరంలో ఉంచి ఎన్ని సౌకర్యాలు కల్పించినా, అది ఎప్పటికైనా అడవిలోకి ఎగిరిపోయేదే. దాన్ని బంగారు పంజరంలో ఉంచినా, మంచి సదుపాయాలు ఆహారం ఏర్పాటు చేసినా వెళ్ళేపుడు ఎవ్వరికీ చెప్పదు. ఏమీ తీసుకెళ్ళదు కూడాను. "ఈ పేరాలో (పేజీ18) మనను ఇలా తయారు చేసి, తర్వాతి పేరాలో ఇలా చెబుతారు. 'అలాగే ఈ దేహమనే పంజరం నుంచి జీవమనే చిలుక కూడా.. ఎప్పుడైనా ఎగిరిపోతుంది" ఈ రెండు పేరాలు చదివిన వారికి మృత్యువు పట్ల వెరపు కలుగదు. సరికదా.. సహజమే అనిపించుతుంది.

మరో కథ 'తుంగ'లో జీవిత సమస్యల గురించి. "తుంగ నీటి ప్రవాహాన్ని ఎదుర్కోవాల్సి వస్తే, మనం కాల ప్రవాహాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. మనిషన్నాక పరిస్థితులకు తలవంచి ఉన్నది.. ఉన్నది ఉన్నట్లుగా స్వీకరించి నిలబడాలి తుంగలాగ. దాన్నే ఆలోచిస్తూ కూర్చుంటే సమస్యల సుడిగుండంలో కొట్టుకుపోతాము" (పే.21) జీవన వ్యాపారానికి పనికి వచ్చే ఎంతటి ఉదాత్తమైన భావన! పైన ఉదహరించిన రెండు కథల్లో రెండవది జీవనం సాగించేందుకు మొదటిది జీవితాంతాల్ని ప్రశాంతంగా ఎదుర్కునేందుకు పనికివచ్చే పరమసత్యాలు.


సంపుటిలో ఇచ్చిన అరవయి కథా వ్యాసాలు అన్నీ ఆణిముత్యాలే! అపరంజిలా పొదిగిన రత్నాలే!! మరో దశాబ్దం తరువాత చదివినా, వాడని వీడని సత్యాలే! చక్కెరలో ముంచి ఇస్తోన్న చేదు మాత్రలే! రాజుగారికి అభినందనలు. ప్రతి సాహితీపేక్షకుల పాఠకుడు కొని చదివి దాచుకుని మరికొంత కాలం తరువాత చదివి స్వాంతన పొందగలిగే కథలివి. రాజు గారి కలం నుండి ఇలాంటి వాడని వీడని పొగడలను మరిన్ని చదువుదా మని ఆశిద్దాం.



యద్భావం తద్భవతి
ఆధ్యాత్మిక కథలు



ప్రతులకు:
ఆర్.సి.కృష్ణస్వామిరాజు
22-4-71, బ్యాంకు ఎంప్లాయిస్ కాలనీ,
అక్కరంపల్లి పోస్ట్,
తిరుపతి-517 507
సెల్: 9393662821



- కూర చిదంబరం
సెల్: 8639338675

# తెలుగు సాహిత్యం పై చెరగని సంతకం మహాకవి సినారె

-ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి.

తెలుగు సాహిత్యంలో తనదంటూ ఒక ప్రత్యేకతను సాధించి తర్వాతి తరాలకు స్ఫూర్తిని కలిగించిన నిలువెత్తు తెలుగు సంతకం మహాకవి, పద్మభూషణ్, జ్ఞానపీఠ పురస్కృతులు, డాక్టర్ సి.నారాయణరెడ్డి అని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఈనెల 3న ఆదివారం తురక యంజాల్ లో జరిగిన సినారె 94వ జయంతి మరియు సాహితీ పురస్కారాల ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సినారెతో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. పంచ కట్టుటలోన ప్రపంచాన మొనగాడు తెలుగువాడని ఆ తెలుగు ఖ్యాతిని నలు దిశలకు పంచిన కవులలో ముందు వరుసలో సినారె నిలుస్తారని అన్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల పైచిలుక సినారెతో ఉన్న పలు జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు ఆ మహాకవి ఎప్పటికీ మన గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. అనేక ప్రక్రియల్లో విలువైన రచనలు చేసి తెలుగుజాతికి తరగని ఖ్యాతిని కలిగించారని అన్నారు.

ఆ మహానుభావుడు శాశ్వతంగా మన మధ్యలో నిలిచి ఉండాలనుకుంటే , ఆయన విగ్రహాన్ని ట్యాంకుబండుపైన ఏర్పాటు



పురస్కార గ్రహీతలతో అతిథులు బైస దేవదాసు, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి , డా॥ నందిని సిధారెడ్డి , మాజీ కౌన్సిలర్ కాకుమాను సునీల్, దాసరి దయానంద రెడ్డి, డా॥ పోరెడ్డి రంగయ్య, మల్లెకేడి రాములు.

చేసుకోవాలని, అందుకు నా వంతుగా ముఖ్యమంత్రి తో మాట్లాడి మ ఆ పనులకు శ్రీకారం చుడతానని అన్నారు. ఇందుకు ఇలాంటి సాహిత్య సేవా సంస్థలు సినారె కుటుంబ సభ్యులు ఒక కమిటీగా ఏర్పడి తగు నివేదికలతో వచ్చినట్లయితే కార్యాచరణకు ముందుండి పనుల పర్యవేక్షణ చేసానన్నారు.

కార్యక్రమానికి సభాధ్యక్షత వహించిన ప్రముఖకవి తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు డాక్టర్ నందిని సిద్ధారెడ్డి మాట్లాడుతూ నారాయణ రెడ్డి తెలుగు సాహిత్యంలో ధ్రువ తారల నిలిచి ఎందరో కవులకు స్ఫూర్తిని కలిగించారన్నారు. ఆయన పేరిట కళాపీఠం ఏర్పాటు చేసి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలువురు సాహితీకారులు గుర్తిస్తూ పురస్కారా లు అందజేయడం చాలా సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. పురస్కారం కేవలం భౌతికమైన విషయమే గాకుండా, ఆ మహాకవి అందించిన మార్గాన్ని అందిపుచ్చుకొని ఆ మార్గంలో ఈనాటి కవులు ప్రయాణం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు ఒక కవికి . ఒక వక్తకు ఉండాల్సిన సంపూర్ణ లక్షణాలు ఆయనలో మనం చూస్తామన్నారు. జీవితాన్ని ఆయా సందర్భాలలో కవితాత్మకంగా గొప్పగా ఆవిష్కరించారన్నారు. ఇంతకూ జీవించడం అంటే ఏమిటీ? గాలివాలుకు కొట్టుకుపోవడం కాదు,ముంచుకొచ్చే కాల కల్లోనికి ఎదురీదడమే అని అన్న కవితా పంక్తులను గుర్తు చేసుకున్నారు. ఆయనకు ఎం .ఏ లో శిష్యుడిగానే కాకుండా పరిశోధన చేసే అవకాశం రావడం ఒక గొప్ప జ్ఞాపకం అని అన్నారు.

కార్యక్రమంలో ఆత్మీయ అతిథిగా పాల్గొన్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు ప్రసంగిస్తూ సినారెతో కలిసి పాల్గొన్న కార్యక్రమాల అనుభవాలను ఈ సందర్భంగా పంచు కున్నారు. సమయపాలన, సభలో ఎలా మాట్లాడాలి, ఏం మాట్లాడాలి, సమయస్ఫూర్తి, క్రమశిక్షణ ఇలాంటి అనేక అంశాలు ఆయనలో గమనించడం జరిగిందన్నారు. ముఖ్యంగా నేటి నిజం దినపత్రికకు ఆయన ఇచ్చిన సూచనలు మాకు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. అలాంటి మహాకవి జీవించిన కాలంలో మనం కూడా జీవించడం గొప్ప అదృష్టం అన్నారు. అద్దంలో నిలిచిన శబ్దంలో ఆర్ద్రమూర్తిని చూపే ది కవిత్వం అని సినారె అన్నట్టుగా కవిత్వం ఎప్పుడూ



డా॥లింగంపల్లి రమచంద్రకు జీవన సాఫల్య పురస్కారం ప్రాధానం చేస్తున్న అతిథులు.

కాలవాచి అంటూ ఆదిశగా కొత్తగా వస్తున్న కవులు గమనించాలన్నారు. మహాకవి సినారె కళాపీఠం అధ్యక్షుడు మల్లెకేడి రాములు చేస్తున్న సాహిత్య సేవను అభినందించారు. సినారె దగ్గర కారు డ్రైవర్ గా పని చేసిన వ్యక్తి ఆయన పట్ల ఇంత గౌరవాన్ని పెంచుకొని ఎలా ఇలా కార్యక్రమం చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమం లో ప్రముఖ సంఘ సేవకులు దాసరి దయానంద రెడ్డి, తుర్క యంజాల్ మాజీ కౌన్సిలర్ కాకుమాను సునీల్ తదితరులు అతిథులుగా పాల్గొని మాట్లాడుతు మహాకవి సినారె జన్మదినం సందర్భంగా కవులను సత్కరించుకోవడం గొప్ప సాంప్రదా యమని ప్రతి ఏటా నిర్వహించే ఈ కార్యక్రమానికి తమ సహాయ సహకారాలు తప్పక వుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవన సాఫల్య పురస్కారాన్ని ఆలేరుకు చెందిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ లింగంపల్లి రామచంద్ర, సినారె సాహిత్య పురస్కారాలను నిజామా బాద్ జిల్లాకు చెందిన డాక్టర్ నాళేశ్వ రం శంకరం, భాగ్యనగరం కు చెం దిన డాక్టర్ రాధశ్రీ, డాక్టర్ ఆచార్య ఫణీంద్ర , అరుణ నారదభట్ల యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన కాసుల ప్రతాపరెడ్డి, మహబూబాబాద్ కు చెందిన మౌనశ్రీ మల్లిక్, వరంగల్లు కు చెందిన డాక్టర్ మంథని శంకర్, మహబూబ్ నగర్‌కు చెందిన డాక్టర్ అగ్రహారం చందోజీ రావు, రంగారెడ్డి జిల్లాకు చెందిన దోరవేటి చెన్నయ్య,పెద్దూరి వెంకట దాసు, కరీంనగర్ జిల్లాకు చెందిన జువ్వాడి



మల్లెకేడి రాములు దంపతులను సత్కరిస్తున్న అతిథులు.

దేవీప్రసాద్, డాక్టర్ తత్వాది ప్రమోద్ కుమార్, సిద్దిపేటకు చెందిన డాక్టర్ పొన్నాల బాలయ్య అందుకున్నారు.

**జీవన సాఫల్యపురస్కార గ్రహిత స్పందన:**

జీవన సాఫల్య పురస్కార గ్రహిత ఇటీవలే అశీతి పూర్తి చేసుకున్న డా॥లింగంపల్లి రామచంద్ర మాట్లాడుతు విద్యార్థి దశలో సినారెగారిని దగ్గర్నుండి చూడాలన్న తపన, ఆయనతో మాట్లాడాలన్న కోరిక తనను వెంటాడిందని ఆ కల ఓ రోజు నిజమైందని ఆనాటి ముచ్చట్లు వివరిస్తూ మహాదానంతపడ్డారు.

**సాహితీ పురస్కార గ్రహితల స్పందనలు:**

డా॥ నాళేశ్వరం శంకరం మాట్లాడుతు తాను ఎమ్మె పరీక్ష రాస్తున్న సమయంలో క్లాసురూంలో సినారెగారిని అలా చూస్తుండిపోయానని, నన్ను మళ్ళీ చూద్దువుగాని ముందు పరీక్ష రాయమని అన్న మాటలు గుర్తు చేసుకున్నారు.

డా॥రాధశ్రీ సినారె మీద ఆశు పద్యాలను వినిపించారు. సినారె తన గ్రంథానికి ముందు మాట రాయడంతో పాటు గ్రంథావిష్కరణ చేసిన సంఘటనను డా॥ ఆచార్య ఫణీంద్ర వివరించారు. క్లాసులో సినారెగారి పాఠాలు విని తెగ ఆనందపడ్డానని కాసుల ప్రతాప్‌రెడ్డి అన్నారు. తన పద్యంతో సినారెను దొరవేటి చెన్నయ్య కొనియాడారు. ఎక్కడ ప్రచురణగాని, ఎవరూ చదవని సినారె రాసిన ఒక పాటను మౌనశ్రీ మల్లిక్ పాడి అందర్నీ ఆశ్చర్యపరిచారు. ఒక సభలో వ్యాఖ్యత రాని కారణంగా ఆ సభకు వ్యాఖ్యాతగా వ్యవహరించే అవకాశం తనకు దక్కిందని ఆ సభలో అక్కినేని నాగేశ్వరరావు, సినారెగార్లు వున్నారని ఒక పోలీసు ఉద్యోగం చేసే వ్యక్తి వ్యాఖ్యాతగా రాణిస్తాడా అని ప్రశ్నించి తుదకు తన వ్యాఖ్యానం నచ్చి మెచ్చుకున్న సందర్భాన్ని పెద్దూరి వెంకటదాసు గుర్తు చేసుకున్నారు.

తన మొదటి కవిత నేటినిజం పత్రికలో ప్రచురితం జరిగిందని, ఆ ప్రోత్సాహంతో కవిత్వం అబ్బిందని, సినారె కవిత్వం చదువుతు ఎంతో నేర్చుకున్నానని శ్రీమతి అరుణ నారదభట్ల వివరించారు. మంజీర రచయితల సంఘం ముఖ్యంగా నా గురువు డా॥నందిని సిదారెడ్డిగారి ప్రోత్సాహంతో, సూచనలతో కవిత్వం రాస్తున్నానని నా గురువుగారికి గురువైన సినారె పేరున సాహిత్య పురస్కారం అందుకున్నందుకు ఆనందంగా వుందని డా॥పొన్నాల బాలయ్య అన్నారు.

జువ్వాడి దేవిప్రసాద్, డా॥ తత్వాతి ప్రమోద్ కుమార్, డా॥ మంథని శంకర్, డా॥ అగ్రహారం ఛందోజీ రావులు సినారెతో గల తమ తమ అనుభవాలను వివరించారు.


మహాకవి సినారె కళాపీఠం అధ్యక్షులు మల్లికేడి రాములు సినారెకు కారు డ్రైవర్‌గా పని చేస్తు అనేక విషయాలు తెలుసుకోగలిగానని ఆ గొప్ప మేధావి మన్ననలు పొందానని ఆయనకు సేవ చేసుకునే భాగ్యం కలిగినందుకు తాను అదృష్టవంతుడనని అన్నారు. ఆ సాహితీవేత్త పేరున సంస్థను నెలకొల్పి గత నాలుగు సంవత్సరాలుగా ప్రతి యేట ఆయన పేరున రాష్ట్రంలోని పలువురు కవులను సత్కరించుకుంటు ఆయన ఋణం తీర్చుకుంటున్నానని ఈ కార్యక్రమానికి ఎందరెందరో సహకరిస్తు ప్రోత్సహిస్తున్నం దులకు సభను విజయవంతం చేసినందులకు పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. తేజ సాహిత్య సేవా సంస్థ అధ్యక్షులు డా॥పోరెడ్డి రంగయ్య కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించి సినారె రాసిన అనేక పాటలు పాడి సినారె సినీ సాహిత్య గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో మహాకవి సినారె కళాపీఠంకార్యదర్శి సుమిత్ర , కార్యవర్గ సభ్యుడు కిట్టు, సాహితీవేత్తలు కందుకూరి శ్రీరాములు, శ్రీమతి బైస వీణదాసు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ నాళేశ్వరం శంకరం




డాక్టర్ రాధశ్రీ




డాక్టర్ ఆచార్య ఫణీంద్ర




కాసుల ప్రతాప్ రెడ్డి




అరుణ నారదభట్ల



పెద్దూరి వెంకట దాసు



డాక్టర్ పొన్నాల బాలయ్య



డాక్టర్ అగ్రహారం ఛందోజీ రావు



దోరవేటి చెన్నయ్య



మౌనశ్రీ మల్లిక్



జువ్వాడి దేవీప్రసాద్



డాక్టర్ తత్వాది ప్రమోద్ కుమార్



డాక్టర్ మంథని శంకర్

---

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1531వ రోజు 'మానసిక ఆరోగ్యం' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'మానసిక ఆరోగ్యం' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.-సంపాదకులు

**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**

అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:

**-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు,** 9441046839



### ఎద్దు పుండు

ముందు నవ్వుకుంట మాట్లాడుతూ
ఎనుక ఎక్కిరిస్తరు
ఈ లోకం తీరే ఇంత.
రాష్ట్రాలపై రాష్ట్రాలను
దేశాలపై దేశాలను
ఉసిగొల్పి
ఊపిరితీసే యుద్ధతంత్రాలు
బాంబులతో
నిప్పుల కుంపటి ఈ జగం
మొసమర్రని జీవితాలు
యుద్ధబాధితులవి.
ఎద్దు పుండు
కాకికి ముద్దా?
తోక తోటి ఎంత గొట్టినా
అది
గాయం మాననీయదు
మారణాయుధాల వ్యాపారి
ఏ దేశాన్నీ
సుఖశాంతులతో బతకనీయడు!!!.
అటెగదోసి
నిప్పు రాజేసి
ఇటు
ఫైర్ ఇంజన్ పంపుతడు
దుఃఖితుల కన్నీళ్ళతో
పన్నీటి స్నానం చేస్తడు.
మనసంతా
మక్కువతో మాయజేస్తూ
లోకాన్ని నమ్మిస్తూ
నోబెల్ శాంతి పురస్కారానికి
తాహతు లేకున్నా తండ్లాట.
తెంపరితనం
మనసులోంచి
తెగిపోయేదెపుడో?!!!
నిజమైన
శాంతి మాలలల్లేదెపుడో?!!!
శకుని పాచికలను
ఆటకట్టించే
కృష్ణ మాయేది!.
నిజంగా
మనిషి
డబ్బు జబ్బు చేసిందా?
మనసును
అదుపులో ఉంచుకోక
అమ్మకం త్రాసులోంచి
దిగలేకపోతుందా?.
మనసున్న
మనసు గల మారాజులకు
సుఖశాంతులేవీ!
విషపు తేనెటీగల గుంపోలే
ఆషాడభూతులు సంచరించే
కాలం ఆగేదెలా!!?.

-ఏడెల్లి రాములు

### మానసిక వత్తిడి

మనిషి చక్కనైతే
మనసు చక్కన
జీవన చక్రం క్రమమైతే
అంతా సక్రమమే
నవజీవన శైలిలో
మనసుపై వత్తిడి
మానసిక వత్తిడిలో
మనిషి జీవితం
ఆటలు పాటలు మానిన
జీవనవిధానం
స్వాభావిక ఆహారం
మానేసిన యువత
వేపుడు ఆహారం
అనారోగ్యమని విస్మరించి
వ్యాయామం అసలే లేక
కూర్చున్న చోటే కుంభకర్ణుడి నిద్ర
రాత్రి పగలు మరచిన జీవన విధానం
నిశాచర జీవనం
కార్యనిర్వహణం
సూర్యోదయ వేళ
రశ్మి మనోరంజితమెప్పుడో
రాత్రంతా మెలకువ
పగటిపూట నిద్ర
అదేమంటే
అంతర్జాతీయ కాలచక్రమని
నియతిలేని జీవిత నియమావళి
తనువు ఊగే
అనారోగ్య తరంగమై
మానసిక ఆరోగ్యానికి
చిరునామా గల్లంతై.
కాలమేదైనా
వయస్సు ఏదైనా
జీవనసరళి
జీవనసమరంలో
విజేతగా నిలిచే వేళ
మానసిక ఆరోగ్యం
మహిమాన్వితం.

-లక్ష్మారెడ్డి పసుల

### సౌండ్ మైండ్!

సౌండ్ మైండ్ ఇన్
సౌండ్ బాడీ
శారీరక ఆరోగ్యమే
మానసిక ఆరోగ్యానికి పునాది
ఆకలి పేదరికం
జన్యురోగాలతో
బాల్యంలోనే
అస్థిరత అయోమయం.
ఒత్తిళ్లు తట్టుకుని
బురదలో కమలంలా
కిలకిలతో కనులువిప్పే
కమలాలు
సర్దుబాటు
దిద్దుబాటుతో
పాజిటివ్ భావాలతో.
భయం భీతి
అనవసర ఆలోచనలను
బ్లాక్ బోర్డుపై డస్టర్ లా తుడిచేసి
డిప్రెషన్ లోంచి బైట పడటమే
మానసిక ఆరోగ్యానికి మూలం.
వర్తమానంలో బతుకు
భవిష్యత్తు గూర్చిన ఆలోచనతో
బతుకు చితుకు
కుటుంబ సమస్యలు
రోగాలు కొట్లాటలు
కీచులాటలతో బాల్యం ఛిద్రం!
చల్లని హస్తం ఓదార్పుతో
బడిబాట లో
నడిచే బుడతలు
తట్టుకుని
స్ఫూర్తిదాతలుగా మారుతున్న కాలం.
ఏకాకి కాకిలా
వృద్ధుల చింత
పెన్షన్ లేని బతుకులు
విసుగ్గా విదిల్చే మెతుకులతో
డీలాపడి
ఇంటినుంచి మాయం.
డ్రగ్స్ మాదకద్రవ్యాలు
మానగానే
పిచ్చిగా ప్రవర్తిస్తూ
మసిబారే జీవితాలు.
నడక
రోజంతా బిజీగా
ఆలయంలో పార్కులో
పిల్ల పెద్దలతో
ముచ్చట్లు ఆటలతో
క్షణక్షణం
అనుక్షణం
పనితో తేనెటీగలా ఎగురుతూ
సేవాకార్యక్రమాల్లో
పాలుపంచుకునే ధన్యులు
సింపుల్ లివింగ్
హై థింకింగ్ తో
తాము నవ్వుతూ
నవ్విస్తూ బతికే
కాలంగడిపేవారు
సరైన మార్గదర్శకులు.

-ఎ.రాజ్యశ్రీ

### చింతకు స్వస్తి

అయ్యో!
సమయానికి చేరుకుంటే
బాగుండేదని
తప్పిపోయిన బస్సు
లేదా
విమానం గురించి
బాధపడుతాం
అది మృత్యుశకటంగా
మారిందని
తెల్లవారే పేపర్లో
వార్త చదివి
అనుకునే మాట..
అంతా మన మంచికే!.
అయ్యో!
మంచి ఆస్తి
అంతస్తులున్నసంబంధం
తప్పిపోయిందని
చింతించేలోపులో తెలుస్తుంది
వరుని అవగుణాల సమాచారం!
హమ్మయ్య!
అంతా మన మంచికే అనుకుంటాం!.
బూజు పట్టిన ద్రావణాన్నుంచి
సూక్ష్మజీవి నాశకాన్ని
తయారుచేసిన
అలెగ్జాండర్ ఫ్లెమింగ్ కూడా
అనుకునే ఉంటాడు తన భాషలో
అంతా మన మంచికే అని!.
నిన్న మొన్నటి
ప్రళయాంతక
కరోనా సైతం
కుటుంబ విలువలు నేర్పి
కాలుష్యాన్ని రూపుమాపి
అంతా మన మంచికే
అనుకునేలా చేసిందిగా!.
అలా అనుకోవడంలోనే ఉంది
మానసిక నిశ్చింత
నిద్రలో ప్రశాంతత!.
అయ్యో అనే నిరాశతో
నీరసమే తప్ప
జీవనగతి తప్పడమే తప్ప
జరిగిన గతాన్ని మార్చలేం
జరగబోయేదేమిటో తెలియలేం!.
జరిగేదంతా
మన మంచికే అనుకుంటేనే
చేసిన పొరబాట్లను
సరిదిద్దుకుంటేనే
అశాంతిని జయించగలం
భవిష్యత్తు ప్రణాళికలు వేయగలం!.
పెద్దల మాటను పాటిద్దాం
చింతకు స్వస్తి చెప్పేద్దాం
మానసిక ఆరోగ్యంతో జీవిద్దాం!!.

-చంద్రకళ దీకొండ

### శిక్షణతోనే రక్షణ

ఎన్ని నీతులు చెప్పినా
మనసొక విహంగం.
గగన సీమ నుండి
దుమికే జ్యోత్స్న
తనదేనన్న పిచ్చిది
మనసు
చివరకు
సఫలత లేని కలలు,
కలత మిగిలిన కళ్ళు
కన్నీళ్లు.
కాపురం దేవుని గోపురం
అనుకున్న మనసు
అది శిథిలసౌధమని
తెలిసినవేళ
కూకటి వేళ్ళతో
కూలిన వృక్షమే.
కనపడని
మానసిక అనారోగ్యానికి
కనపడే కారకాలు
సవాలక్ష.
నచ్చని విషయాలు.

-డా.సి.వసుంధర

### ఓ ఊహా!

మెరుపులా
మదినితట్టరాదా
తారలా
తళుకులాడరాదా.
సీతాకోకలా
కనిపించరాదా
చిలుకలా
పలికించరాదా.
ఉయ్యాల్లా
ఊపరాదా
కెరటాల్లా
ఎగిసిపడరాదా.
తేనెటీగల్లా
తుట్టెనుకట్టరాదా
తూనీగల్లా
గుంపుగారారాదా.
కోకిలలా
కూయరాదా
రాయంసలా
నడుపరాదా
గాలిలా
ప్రసరించరాదా
నీరులా
ప్రవహించరాదా.
మల్లెలా
పూయరాదా
పరిమళంలా
వ్యాపించరాదా.
చిగురాకులా
తొడగరాదా
మొక్కలా
మొలకెత్తరాదా.
వెన్నెలలా
వేడుకపరచరాదా
అరుణబింబంలా
ఉదయించరాదా.
తేనెలా
తోచరాదా
కవితలా
పుటకెక్కరాదా.
పాఠకులను
పరవశపరుస్తా
విమర్శకులను
విస్మయపరుస్తా.
గమ్యమును
చేరుకుంటా
జ్ఞాపకాలను
నెమరేసుకుంటా.
ఊహలను
స్వాగతించుతా
మనసుకు
మేతనుపెడతా.
చమక్కుచూపి
ముగించుతా
గమ్మత్తుచేసి
గడియవేసుకుంటా



-గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్
7981616630

### గులామీ

మోచేతి బెల్లానికి
ఆశ పడ్డంత కాలం
ఆ తలకాయకి
ఉనికి ఎక్కడిది..?!

### జాడ

కప్పేసిన
రూపాయి జెండా కింద
మానవత్వం...
మనిషి ఎక్కడ దొరుకుతాడు..!

-మెతుకూరి అశోక్ కుమార్
9247380976




తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో
ప్రముఖ గజల్ కవయిత్రి విజయ గోలి
మూడవ గజల్ సంపుటి
నవరాగిణి
పుస్తకావిష్కరణ మహోత్సవం
మరియు
తెలుగు గజల్ గాన విభావరి
(సంగీత వాద్య సహిత గజల్ గాన కార్యక్రమం)
వేదిక : రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలు
10-8-2025 ఆదివారం సాయంత్రం 6 గంటలకు
సభాధ్యక్షులు
కళారత్న డా॥ బిక్కి కృష్ణ, సుప్రసిద్ధ కవి, విమర్శకులు, సినీ గేయ రచయిత
ముఖ్య అతిథి
డా॥ మామిడి హరికృష్ణ, తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సంచాలకులు
పుస్తక ఆవిష్కరణ
శ్రీ రాజేష్ పగడాల, ఫౌండర్ & మేనేజింగ్ డైరెక్టర్, పగడాల కన్‌స్ట్రక్షన్స్ ప్రై.లి.
శ్రీమతి భార్గవి పగడాల, ఫౌండర్ & మేనేజింగ్ డైరెక్టర్, బిటిల్ రిమ్ టెక్నాలజీస్.
సారంగపాణి పగడాల, బాబ్‌సన్ కాలేజీ ఫైనాన్స్ & ఎకనామిక్స్,యుఎస్ఏ
విశిష్ట అతిథులు
శ్రీ శంకర్ సూరారం, ప్రముఖ గజల్ కవి, కీర్తి పురస్కార గ్రహీత
శ్రీమతి డా॥ పి.విజయలక్ష్మి పండిట్
ప్రముఖ గజల్ కవయిత్రి, విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ అధ్యక్షురాలు
శ్రీమతి రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి
ప్రముఖ గజల్ కవయిత్రి, రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు ఫౌండేషన్ అధ్యక్షురాలు
శ్రీ మౌనశ్రీ మల్లిక్, ప్రముఖ కవి, సినీ గేయ రచయిత
శ్రీ కలిమిశ్రీ, సంపాదకులు-నవమల్లెతీగ మాసపత్రిక
గాయకులు :
శ్రీ ఎం.ఆర్.కె.ప్రభాకర్, ఏఐఆర్ గ్రేడ్-1 గాయకులు
శ్రీ దివాకర్, ప్రముఖ తెలుగు గజల్ గాయకులు, శాస్త్రీయ సంగీత గాయకులు
శ్రీమతి శాంతినిర్మల, ప్రముఖ కవయిత్రి, గాయని
సభకు విచ్చేసిన కవులకు, కవయిత్రులకు, గాయకులకు ఆత్మీయ సన్మానం



సాహిత్యం శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్ సంగీతం
ఆహ్వానం
ప్రముఖ రచయిత
శ్రీ తిరుమల వెంకటస్వామి (టి.వి.స్వామి) గారు
రచించిన "కవితావిక"
కవితా సంపుటి ఆవిష్కరణ, అంకితోత్సవం
తేది : 07-08-2025 గురువారం సా॥ 6-00 గం॥లకు
వేదిక : కళా లలిత కళావేదిక, శ్రీ త్యాగరాయ గానసభ, హైదరాబాద్.
సభాధ్యక్షులు : శ్రీ బైస దేవదాస్ గారు, సంపాదకులు, 'నేటినిజం' దినపత్రిక
ముఖ్య అతిథి, ఆవిష్కర్త : శ్రీ రేలంగి నరసింహారావు గారు, ప్రముఖ (చలనచిత్ర) సినీ దర్శకులు
విశిష్ట అతిథి & కృతిస్వీకర్త : ఆచార్య కొలకలూరి మధుజ్యోతి గారు, పూర్వ ఉపాధ్యక్షులు, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం
ఆత్మీయఅతిథులు : శ్రీ బండారుపల్లి రామచంద్రరావు గారు, ప్రముఖ ఆధ్యాత్మిక కవి, 'మానస' అధ్యక్షులు
శ్రీ సి.యస్. రాంబాబు గారు, విశ్రాంత సహాయసంచాలకులు, ఆకాశవాణి
ఆచార్య పి.వి.ఉమా శశి గారు, ప్రముఖ విద్యావేత్త
శ్రీ ఉమ్మడిసింగు రాఘవరావు గారు, ప్రముఖ కవి
గ్రంథకర్తస్పందన : శ్రీ టి.వి. స్వామి గారు, రచయిత
అందరికీ సాదర స్వాగతం
డా॥ లలితవాణి మానస ఉపాధ్యక్షులు
కోకా భవాని మానస కన్వీనర్

